RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -114 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం12 మే 2026

# సవాళ్లను అధిగమించే సమయం ఇదే

## పారిశ్రామిక ప్రగతిలో సిఐఐ కీలకం :చంద్రబాబు






**పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు**


**ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం**

**అందరం కూడా దానిని అనుసరిస్తే మంచిది**

**సవాళ్లను అధిగమించే సమయం ఇదే**

**సిఐఐ సదస్సులో ఏపి సిఎం చంద్రబాబు**

**న్యూఢిల్లీ,మే11 ఆంధ్ర ప్రగతి**
పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. **మిగతా 2లో...**



# జులై 1 నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం

**గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ**

**కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు అంతరాయం కలగకుండా చర్యలు**

**కొత్త కార్డులు జారీ అయ్యే వరకు ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటు**

**న్యూఢిల్లీ,మే11 ఆంధ్ర ప్రగతి**
జీవనోపాది భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ-జీ-రామ్-జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది.
దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల **మిగతా 2లో...**

# భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

**ఆమెను పశువులా చూడొద్దు**

**గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు**



# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

## విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విద్యార్థులకు రూ.వెయ్యి కోట్లతో 9 రకాల వస్తువులతో ఎడ్యుకేషన్ కిట్**

**నాణ్యత లేకుంటే ఆ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి బొక్కలో వేస్తాం**

**ఉత్తమ టీచర్లకు జూన్ 2న, డిసెంబర్ 9న సన్మానం**

**ఏటా 500 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తాం**

**క్యూర్ పరిధిలో రూ.1700 కోట్లతో విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి**




**హైదరాబాద్ ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్ది ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. టెన్త్ తర్వాత విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారనీ, దాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోనీ ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాలను సీఎం**మిగతా 2లో...**




# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

**పోలవరం పెండింగ్ అంశాలను పరిష్కరించండి**

**తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి**

**కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు**

**న్యూఢిల్లీ,మే11ఆంధ్ర ప్రగతి**
పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.
2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు.**మిగతా 2లో...**

# వైఫల్యానికి నిదర్శనం



**బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై**

**రాహుల్ గాంధీ ఘాటు స్పందన**

**ఏడాది పాటు బంగారం కొనొద్దని,**

**ఇంటి నుంచే పనిచేయాలని సూచించిన మోదీ**

**ప్రతిసారీ బాధ్యతను ప్రజలపై నెట్టేస్తున్నారన్న రాహుల్**

2లో.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు



**: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**

**1998 పోఖ్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు**

**సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని**

**బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ**

**సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి**



# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

## సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో లోకేశ్ భేటీ

**అమరావతి,మే11 (ఆంధ్ర ప్రగతి** సింగపూర్‌లోని పుంగోల్ తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జేఐఎస్‌సీ మద్దతుతో అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు.**మిగతా 2లో...**

# ఇప్పటి వరకు చర్యలేవి?

**: బండి భగీరథ్ అంశంపై డీజీపీని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి**

**8న ఫిర్యాదు వస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్న**

**కేసులో సమగ్ర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశం**

**కేసు వివరాలను సీఎంకు వివరించిన డీజీపీ సీవీ ఆనంద్**



**హైదరాబాద్ ఆంధ్ర ప్రగతి**
కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రశ్నించారు **మిగతా 2లో...**

# సవాళ్లను అధిగమించే సమయం ఇదే

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

మొదటిపేజీ తరువాయి

అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్ లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వులను శాశ్వతంగా ఉపసంహరించు కోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జలశక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి సించాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూరు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరుల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎ౩ఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలలను మళ్లించేలా పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ విద్యావిధానం

మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి నిర్వహించారు. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ లోపల క్యూర్ పరిధిలోని విద్యా సంస్థల్లో రూ.1700 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూవిద్యాసంస్థలు, యూనివర్సిటీలు విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుందని వివరించారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.

రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారు ముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖను తన దగ్గర ఉంచుకున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.

1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని చెప్పారు.12 వేల ప్రయివేటు స్కూళ్లలో 38 లక్షల మంది చదువుతున్నారని వివరించారు.ప్రయివేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటీ, ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యాశాఖకు ఎనిమిది శాతం నిధులను కేటాయించామన్నారు. దశల వారీగా విద్యకు 15 శాతం నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలబట్టడమే లక్ష్యమని ప్రకటించారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని అన్నారు.25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యా విధానం పరిశీలనకు ఫిన్లాండ్‌కు పంపించామని వివరించారు.అత్యుత్తమ ప్రదర్శన కనపర్చిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామన్నారు.విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు.రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున, తెలంగాణ తల్లి జన్మదినం డిసెంబర్ తొమ్మిదిన ఉత్తమ టీచర్లకు సన్మానం చేస్తామని వివరించారు.

పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారనీ,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని చెప్పారు.పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామన్నారు.కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అద్భుతంగా అందిస్తున్నామని అన్నారు.ప్రభుత్వం పాఠశాల్లో చదవే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని చెప్పారు.తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని వివరించారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పారు.100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు ధైర్యంగా వాటిలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని చెప్పారు.పాఠశాలలు టీచర్లు, ఐఏఎస్‌లు, రాజకీయ నాయకుల కోసం కాదనీ, పేద విద్యార్థుల కోసం, వారి సంక్ష?మం కోసమని అన్నారు.ఏ నిర్ణయమైనా వెనకడుగు వేయకుండా తీసుకుంటామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే ఎడ్యూకేషన్ కిట్ నాణ్యతను తాను స్వయంగా పరిశీలించానని అన్నారు. ఎడ్యూకేషన్ కిట్ కోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.నాణ్యమైన వస్తువులు రాకపోతే తక్షణమే ప్రజా ప్రతినిధుల దృష్టికి తేవాలని సూచించారు. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేస్తే కంపెనీలను బ్లాక్ లిస్టులో చేరుస్తామనీ, వారిని బొక్కలో వేయించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరైన సమయంలో విద్యార్థులకు చేరాలన్నారు.పాఠశాల ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు ఒక జత బట్టలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మరో జత నెలాఖారున ఇవ్వాలని చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకూ నూటికి నూరు శాతం మార్కులు రావాలన్నదే తన స్వప్నమని అన్నారు.టీచర్లకు మొదటి తారీఖున జీతంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించే బాధ్యత తనదని చెప్పారు.

ప్రభుత్వ టీచర్లది ఉద్యోగం కాదనీ, భావోద్వేగమనీ, అది బరువు కాదనీ బాధ్యత అని అన్నారు.19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు.పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కండ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని కోరారు.విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు మాట్లాడుతున్నారనీ, సమీక్ష సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యా శాఖ మంత్రిగా చూడాలని కోరారు. మంచి విద్యను అందించాలనీ, ఉత్తమ పౌరులను తయారు చేయాలని సూచించారు. త్వరలోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యకమంలో మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, సలహాదారులు కె కేశవరావు, హార్కర వేణుగోపాల్, విహెచ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు .

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు

**: అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు**



భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోక్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోక్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్లం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు.

సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు.

పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# భార్యకు గౌరవంగా జీవించే హక్కుంది

## ఆమెను పశువులా చూడొద్దు

## గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మే11 ఆంధ్ర ప్రగతి**

భార్యను పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహహింస కేసు విచారణలో భాగంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌పై విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఆ పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. నిందితుడు మద్యం మత్తులో ఆ మహిళపై దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు బలంగా గాయమైనట్టు, ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలైన మొదటి భార్య వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్



మొదటిపేజీ తరువాయి

ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాజధాని అమరావతికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠ భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. ఎంవోయూలోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు ఇటీవల సింగపూర్‌లో వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని గుర్తుచేశారు.

# జులై 1 నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం

మొదటిపేజీ తరువాయి

చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది

# వైఫల్యానికి నిదర్శనం

## బంగారం కొనొద్దన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ ఘాటు స్పందన

**న్యూఢిల్లీ,మే11ఆంధ్ర ప్రగతి**

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి 'వైఫల్యానికి నిదర్శనం' అని ఆయన అభివర్ణించారు.

సోమవారం నాడు ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ.. "నిన్న మోదీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు.. వైఫల్యానికి రుజువులు" అని పేర్కొన్నారు. "12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక 'కాంప్రమైజ్డ్ ప్రధాని' దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదు" అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. **ప్రధాని విజ్ఞప్తి ఇదే.. :** హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. అలాగే, వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని) విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఏ విధంగానైనా విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# ఇప్పటి వరకు చర్యలేవి?

.మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించారు. కేసులో సమగ్ర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉన్నారని డీజీపీ సమాధానం చెప్పారు. కేసు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు.

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు అంశంపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. సీపీ నుంచి కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. విచారణ కోసం ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు.

కాగా, తన కుమార్తెను బండి భగీరథ్ వేధిస్తున్నారంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్‌విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల క్రింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. మరోవైపు, బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారని శుక్రవారమే భగీరథ్ కరీంనగర్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదైంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

మంగళవారం12 మే 2026

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వైసీపీ మాజీ సర్పంచ్.

## ..టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు.

**..కూడేరు మండలంలో భూ దోపిడీ..**

**నోటీసులు లేకుండానే ఆన్‌లైన్ రికార్డుల తారుమారు.**

**..దూళంవారిపల్లిలో భూ మాఫియా దౌర్జన్యం.. న్యాయం చేయాలంటూ వినతి.**

**..అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు.**

**..మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ.**



**ఆంధ్ర ప్రగతి మంగళగిరి, మే 11:** వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం క్రొత్తమాధవరం గ్రామానికి చెందిన నరసింహులు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 40 సెంట్ల ప్రభుత్వ భూమిని (దీని విలువ సుమారు 2 కోట్ల రూపాయల పైమాటే) మాజీ వైసీపీ సర్పంచ్ అక్రమంగా ఆక్రమించుకోవడం జరిగింది. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు కానీ, పత్రాలు కానీ లేకుండానే ఈ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మించి, వాటిని అద్దెలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా, పక్కనే ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను కూడా అడ్డగోలుగా విక్రయిస్తున్నారు. సదరు ఆక్రమిత స్థలానికి సంబంధించి ఎటువంటి డాక్యుమెంట్లు లేవని ఎమ్మార్వో, అలాగే ఆ కట్టడాలకు ఎటువంటి ఇంటి పన్నులు చెల్లించడం లేదని పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే లిఖితపూర్వకంగా ధృవీకరించారు. అధికారుల నుండి ఎటువంటి సహకారం అందకపోయినా, ఈ మాజీ సర్పంచ్ నకిలీ అనుబంధ సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి, కోర్టు నుండి తాత్కాలిక స్టే తెచ్చుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధలకు అర్జీ ఇచ్చి అభ్యర్ధించారు.

అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి ఎం. ఎర్ర సుబ్బన్నకు 2007 సంవత్సరంలో ప్రభుత్వం సర్వే నంబర్ 495/3 లో 5 ఎకరాల డి-పట్టా భూమిని మంజూరు చేసింది. అయితే తన తండ్రి అనారోగ్యంతో 08/02/2025న మరణించిన తర్వాత తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే స్థానిక వీఆర్వో, ఎమ్మార్వోలు కుమ్మక్కై ఆ భూమిని ఆన్‌లైన్‌లో ఇతరుల పేరు మీద నమోదు చేశారు. తమ తెలియకుండానే మహమ్మద్ బాషా (05 సెంట్లు), పూజారి ప్రసాద్ (2.45 ఎకరాలు) పేర్లతో ఆన్‌లైన్ రికార్డులను మార్చారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, ఆర్డీవో కోర్టులో అప్పీల్ వేసినా ఫలితం లేకుండా పోయింది. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే, మళ్లీ ఏ. ప్రదీప్ కుమార్, ఇందిరాదేవి, మారుతీ ప్రసాద్, ఎం. వెంకటరమణ అనే వ్యక్తుల పేర్లపై మరో 2.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్ నమోదు చేశారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మజరా దూలంవారిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ తండ్రి (లేట్) సి. వెంకట్రాయప్ప పేరుతో 1989లో ప్రభుత్వం సర్వే నంబరు 41-4 నందు 1.58 ఎకరాల వ్యవసాయ భూమిని (పట్టా నంబరు: కా.వీ.చీశీ. 923/4/1989) మంజూరు చేసింది. గత 30 ఏళ్లుగా ఈ భూమిపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారుల సహకారంతో రికార్డులను తారుమారు చేసి, తమ భూమిని దూళంవారిపల్లికి చెందిన కడపల ఆనంద రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. ఆనంద రెడ్డి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలవంతుడు కావడంతో, తమ భూమిని తాము కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిన్నెగుడి గ్రామానికి చెందిన రామాంజనేయులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..బోడగాని దాకి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 44/2లో సుమారు 3 ఎకరాల 83 సెంట్ల భూమిని ప్రభుత్వం 1950వ సంవత్సరంలోనే తమ బంధువు అయిన ఆసాది ఓబులేసు అనే వ్యక్తికి 'డి-పట్టా' కింద మంజూరు చేసింది. గత 76 ఏళ్లుగా ఆ కుటుంబం ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే ఓబులేసు మరణించాక, ఆర్థిక ఇబ్బందుల వల్ల తమ కుటుంబ సభ్యులు పనుల కోసం అనంతపురం పట్టణానికి వలస వెళ్లాం. తాము గ్రామంలో లేని సమయాన్ని అదునుగా తీసుకున్న చిన్ను సుబ్బరాయుడు, వి. వెంకటేషులు, టి. బీజన్యం రసూల్ సాబ్, అల్లీ పీరా అనే నలుగురు వ్యక్తులు.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆ 'డి-పట్టా' భూమిని చెరో 96 సెంట్ల చొప్పున అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించుకుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## కొత్తూరు సుబ్బరాయునికి 2.64 లక్షలు విరాళం..!



**ఆంధ్ర ప్రగతి పాణ్యం/కొత్తూరు మే 11:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 2 లక్షల 64 వేలు విరాళంగా దాతలు సోమవారం ఇచ్చినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. కర్నూలు పట్టణం రాఘ మయూరి నందు గల శివకుమార్ రమాదేవిల కుమారుడు, కోడలు వి.ఎస్.ఎన్ యశ్వంత్, తేజశ్విని వారి కుటుంబ సభ్యులు స్వామివారికి 1 కేజీ వెండి మొక్కుబడిగా గాను, వాటి నిమిత్తము 2 లక్షల 64 వేల రూపాయలు ఏపీజీబీ నందివర్గం బ్యాంక్ నుండి ఫిక్స్ డిపాజిట్ రూపంలో విరాళంగా ఇచ్చి వాటి నుండి ప్రతి సంవత్సరమునకు వచ్చు వడ్డీ ఆలయ అభివృద్ధికి తోడ్పడే విధంగా విరాళం ఇచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రములతో సత్కరించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నారాయణస్వామి గ్రామపంచాయతీ కార్యదర్శి సరస్వతి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి.

**..డేటా అప్‌లోడింగ్, పనితీరు సూచికలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి సమీక్ష.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 11:**జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల పనితీరు, లక్ష్యాలు, అభివృద్ధి సూచికలపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజలు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా నాణ్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపాలని అధికారులకు సూచించారు. ప్రతివారం ఆర్డీఓలు కనీసం 5 నుంచి 6 మంది అర్జీదారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను ఎక్సెల్ షీట్‌తో పాటు వాయిస్ లేదా వీడియో రికార్డింగ్ రూపంలో రూపొందించి సీఎంఓ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈపిటిఎస్ డాక్యుమెంట్ల అప్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి డెప్యూటీ సీఈఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన 7 లక్షల డేటాను తహశీల్దార్లు, ఆర్డీఓలు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓలు 7 లక్షల డేటాను, జిల్లా అధికారులు మరో 7 లక్షల డేటా పూర్తి చేసి మొత్తం 21 లక్షల డేటా లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

శాఖల వారీగా పనితీరును కలెక్టర్ సమీక్షిస్తూ, క్రీడల శాఖ ఎస్ఏపీ విభాగం 52 పాయింట్లతో వెనుకబడిందని, సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో విద్యార్థుల పాల్గొనడం, క్రీడల యాప్ వినియోగం పెంచి పనితీరును 80 శాతానికి పైగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఆర్ఓఆర్ సర్వే, రోడ్ల గుంతల పూడ్చివేత, హౌసింగ్, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలు మిడ్ డే మీల్స్, రేషన్ పంపిణీ, ఏపీఎస్ఆర్టీసీ సేవల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనితీరును మెరుగుపరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పనితీరు స్కోరు గతంలో 68.6 శాతంగా ఉండగా ప్రస్తుతం 71.2 శాతానికి చేరుకుందని, రాబోయే మూడు నెలల్లో ప్రతి శాఖ నెలకు కనీసం 1.5 శాతం చొప్పున పనితీరు మెరుగుపరచుకుని మొత్తం 4.5 శాతం వృద్ధి సాధించాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారు.

## భూపనపాడుకు భరోసాగా నిలిచిన జిల్లా కలెక్టర్

**..30 ఏళ్ల సమస్యలకు ఆరు నెలల్లో శాశ్వత పరిష్కారం.**

**.."భూపనపాడు ఆడపడుచు"గా కలెక్టర్ రాజకుమారికి గ్రామస్థుల ఘన సన్మానం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 11:** ప్రజా సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిష్కారం చూపితే గ్రామాల రూపురేఖలు ఎలా మారుతాయో భూపనపాడు గ్రామం నేటి పరిస్థితి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పాణ్యం మండలం భూపనపాడు గ్రామ ప్రజలు తమ గ్రామ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించినందుకు కృతజ్ఞతగా జిల్లా కలెక్టర్ రాజకుమారిని ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత కలిసి గజమాలలు, పసుపు-కుంకుమలతో ఆమెకు సత్కారం నిర్వహించారు. ప్రేమాభిమానాల సూచకంగా కలెక్టర్‌ను "భూపనపాడు ఆడపడుచు"గా అభివర్ణించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భూపనపాడు బీసీ కాలనీకి జిల్లా కలెక్టర్ చొరవతో కొత్త జీవం లభించిందన్నారు. గత 30 ఏళ్లుగా కాలనీలో సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడేవారమని తెలిపారు. ప్రతి వర్షాకాలంలో మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొనేదని వివరించారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి స్వయంగా గ్రామాన్ని సందర్శించి, వర్షంలోనే కాలనీ వీధులన్నీ తిరిగి పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన ఆమె వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి సీసీ రోడ్లు, సమగ్ర డ్రైనేజీ నిర్మాణ పనులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఆమె ప్రత్యేక చొరవతో కేవలం ఆరు నెలల్లోనే పనులు పూర్తై గ్రామం పూర్తిగా మారిపోయిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షం కురిసినా నీరు నిల్వ లేకుండా డ్రైనేజీ ద్వారా సాఫీగా వెళ్లిపోతోందని, ఆధునిక సదుపాయాలతో కూడిన రహదారులు అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఈ విజయం ఒక్కరి కృషి ఫలితం కాదని, ఇంజనీరింగ్ శాఖతో పాటు అన్ని విభాగాల అధికారుల సమిష్టి కృషివల్లే సాధ్యమైందన్నారు. గ్రామ ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ అభివృద్ధి, ఉమ్మడి సమస్యల పరిష్కారానికి ఏకమై కృషి చేయడం తనను ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. తక్కువ సమయంలో నాణ్యతతో పనులు పూర్తి చేసిన అధికారులను ఆమె అభినందించారు. తమపై చూపిన ప్రేమాభిమానాలకు భూపనపాడు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ అభివృద్ధిని క్షేత్రస్థాయికి తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి సేవలను గ్రామస్థులు కొనియాడారు. ఇలాంటి అధికారులు జిల్లాకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

## ఫిర్యాదులు లేని జిల్లాగా నంద్యాల రూపుదిద్దాలి

**.జిల్లా కలెక్టర్ రాజకుమారి.**

**..ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా ప్రతినిధులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 11:** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పూర్తిస్థాయిలో పరిష్కరించి, ప్రజా ఫిర్యాదులు లేని జిల్లాగా నంద్యాలను తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఆర్డీఓలు తప్పనిసరిగా జిల్లా కేంద్రంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో ప్రతి నెలలోని శుక్రవారాల్లో నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒకే వారంలో అన్ని సమస్యలు పరిష్కరించడం సాధ్యం కాకపోవడంతో, నెలలోని అన్ని శుక్రవారాల్లో ఒకే నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా సమస్యలను సమగ్రంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

ఇందులో భాగంగా 134-ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మే నుంచి జూన్ వరకు, 135-శ్రీశైలం నియోజకవర్గంలో జూన్ నుంచి జూలై వరకు, 136-నందికొట్కూరు నియోజకవర్గంలో జూలై నుంచి ఆగస్టు వరకు, 138-పాణ్యం నియోజకవర్గంలో ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు, 139-నంద్యాల నియోజకవర్గంలో సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకు, 140-బనగానపల్లె నియోజకవర్గంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు, 141-డోన్ నియోజకవర్గంలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రతి శుక్రవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సదరు కార్యక్రమాల రోజుల్లో ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సెలవులు వచ్చిన సందర్భంలో గురువారం లేదా శనివారం నిర్వహించే అవకాశం ఉంటుందని, అవసరమైతే సెలవు రోజుల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి మండల, మున్సిపల్, కలెక్టరేట్ అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.


ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో నంద్యాల జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే స్థూల దేశీయోత్పత్తి సూచికల్లో 18వ స్థానం, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లలో మెరుగైన ప్రగతి నమోదు చేసినట్లు తెలిపారు. మండలాల్లో తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ మరియు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చర్యలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే జనతా వారధి ధ్యేయం.

**--నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు.**

**--ప్రజల సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్‌కు బీజేపీ విన్నపం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 11:** నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కోరారు. సోమవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన 'జనతా వారధి' కార్యక్రమంలో బాధితుల నుంచి స్వీకరించిన అర్జీలను ఆయన జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య భాజపా వారధిగా ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల రవీంద్ర, కావ్యా రెడ్డి, సీతక్క, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదుకు సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలి

## ..పీజీఆర్ఎస్ ద్వారా 286 దరఖాస్తుల స్వీకరణ. -..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 11:**
ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి, వాటికి సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులు సమర్పించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు అనుగుణంగా స్పష్టమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. అలా చేయడం ద్వారా దరఖాస్తులు తిరిగి రీఓపెన్ కాకుండా ఉండటంతో పాటు, అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం స్థాయిలో కూడా రీఓపెన్ అయిన దరఖాస్తులను స్వయంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం లేదా సరైన ఎండార్స్మెంట్ ఇవ్వకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 5,306 దరఖాస్తులు రీఓపెన్ కాగా, వాటిలో 5,064 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 242 దరఖాస్తులపై సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో 171 దరఖాస్తులు రీఓపెన్ కాగా, అందులో 166 దరఖాస్తులు పరిష్కరించామని, మిగిలిన 5 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలో రీఓపెన్ అయిన అన్ని దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించినట్లు వెల్లడించారు.

1) ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పాలసాగరం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ గత ఆరు నెలలుగా పనిచేయడం లేదని గ్రామస్తుడు ఫిర్యాదు చేయగా, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

2) నంద్యాల పట్టణంలోని దేవనగర్‌కు చెందిన బి. నాగమణి తన భర్త అనారోగ్యంతో మరణించడంతో వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

3) నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఎస్. గోవిందస్వామి కాలనీలో ఉన్న భారీ వృక్షాల కొమ్మలు వర్షాల కారణంగా హై వోల్టేజ్ విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం చేశారు.

# జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన ధనుష్‌కు అభినందనలు.

## ..శాలువాతో సన్మానించి, అభినందించినకర్నూలు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 11:**
రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్ లో ఏప్రిల్ 24 నుండి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వీరేష్ కుమారుడు ధనుష్ విశేష ప్రతిభ కనబరిచారు. 105 కేజీల సబ్ జూనియర్ విభాగంలో 130 కేజీల బరువును డెడ్ లిఫ్టింగ్ చేశారు. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బంగారు పతకం సాధించి కర్నూలు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా



సోమవారం కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీ హుస్సేన్ పీరా గారు ధనుష్‌ను శాలువతో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి లోకేష్ మరియు ఆర్గనైజర్ సెక్రటరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని సహించను

## - స్మార్ట్ సిటీ లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలి -రహదారుల గుంతల గుర్తింపుకు ఏఐ సాంకేతికత వినియోగించాలి

## - తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి - మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి టీ.జీ. భరత్ గుప్తా






**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ మే 11:**
నగరాభివృద్ధికి సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మున్సిపల్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై ఆరా తీశారు, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రహదారులపై ఉన్న గుంతలను గుర్తించి వెంటనే పూడ్చేందుకు ఏఐ సాంకేతికత సహాయం తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో రహదారుల విస్తరణపై స్టడీ నిర్వహించాలని తెలిపారు. సుంకేసుల జలాశయం నుండి మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పైప్‌లైన్ పనులను వేగవంతం చేయాలని, నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని తీసుకుని సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

గార్గేయపురం డంప్‌యార్డులో బయో మైనింగ్ పనులు, ప్లాంట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చెత్త సేకరణకు అవసరమైన ఆటోలను త్వరలోనే తెప్పించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాధనం ఆదా చేసేలా సచివాలయాల తరలింపు, అలాగే అవసరమైన మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు పంప్ హౌస్, గణేష్ నగర్ ప్రాంతాల్లో భూమి కేటాయించాలని సూచించారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని, తొలి దశలో ఆరు పార్కులను అభివృద్ధి చేయాలని తెలిపారు. నగరంలో పూడికతీత పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. టిడ్కో గృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని ఆదేశించారు.

సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, ఆర్వోలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఇంచార్జ్ సిటి ప్లానర్ వై.వి. వెంకటరమణ, అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, పబ్లిక్ హెల్త్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత.

## ..నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో మహిళలకు చికెన్ ఎగ్ కార్ట్స్ పంపిణీ.

## ..రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 11:**
పట్టణ పేద మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత లో భాగంగా నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో మహిళలకు చికెన్ ఎగ్ కార్ట్స్ పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు.

సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో పట్టణ పేద మహిళల జీవనోపాధిని పెంపొందించి, వారిని ఆర్థిక సాధికారితను కలిగించాలనే లక్ష్యంతో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ వారి ఆర్థిక సహకారంతో, మెప్మా ఆధ్వర్యంలో కర్నూలు అర్బన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు 5 మందికి 5 చికెన్ ఎగ్ కార్ట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ... మహిళల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వయం సహాయక సంఘ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి తో అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు 5 మందికి 5 చికెన్ ఎగ్ కార్ట్స్ ను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని, ఒక్కో కార్ట్ విలువ రూ.50 వేల తో మొత్తం ఐదు కార్ట్స్ విలువ రూ.2 లక్షల 50 వేలుగా ఉందని వెల్లడించారు. మెప్మా ద్వారా మహిళలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గుడ్ల ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో ఈ పైలెట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు చిన్న వ్యాపార అవకాశాలను కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.. ఈ కార్ట్స్ ద్వారా మహిళలు వ్యాపారం నిర్వహించి స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# 6 కోట్ల రూపాయల ఖర్చుతో రైతు బజార్ విస్తరణకు భూమి పూజ.

**..150 మంది రైతులకు లబ్ధి.**

**..కర్నూలు స్మార్ట్ సిటీగా మార్చడానికి నిరంతర కృషి.**

**..పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త.**

**..కర్నూలు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.**

**..కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తి పాటి నాగరాజు.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్, మే 11:**
కర్నూలు ను స్మార్ట్ సిటీగా మార్చడానికి నిరంతర కృషి చేస్తున్నామని రైతు బజార్ విస్తరణ భూమి పూజ సందర్భంగా పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త పేర్కొన్నారు.

సోమవారం ఉదయం కర్నూలు పట్టణ సి – క్యాంపు రైతు బజార్ వెనుక పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి.భరత్ గుప్త , కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు తో కలిసి రైతు బజార్ విస్తరణ కొరకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కర్నూలు ను స్మార్ట్ సిటీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకుంటూ ఉన్నామని, అందులో భాగంగా సి – క్యాంపులో ఇప్పుడు ఉన్న రైతు బజార్ ను 150 మంది రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా ఆరు కోట్ల రూపాయలతో విస్తరణ కార్యక్రమం మొదలు పెట్టామని తెలిపారు. ఇందులో రైతులకు అవసరమైన నీరు స్ప్రింక్లింగ్ సిస్టం , డ్రిప్ సిస్టం , పార్కింగ్ సౌకర్యం మరియు రెండు ఫ్లోర్ లతో రైతు బజార్ నిర్మాణం చేయడం జరుగుతుందని , ఈ నిర్మాణ పనులు 9 నెలల లోపు పూర్తి అయ్యేలాగా కాంట్రాక్టర్ ను ఆదేశించడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రైతు బజార్ ను సందర్శించారని తెలిపారు. 1999 లో తను ఏర్పాటు చేసిన , తనకి ఇష్టమైన రైతు బజార్ ను సందర్శించిన సందర్భంగా రైతులతో మాట్లాడిన తరువాత దీని విస్తరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆ హామీ ఇప్పుడు నెరవేర్చడం జరుగుతుంది మంత్రి తెలిపారు. రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసిన వెంటనే ముఖ్యమంత్రి డ్రీమ్ ప్రాజెక్ట్ , పేద ప్రజలకు అత్యంత అవసరమైన మరియు కేవలం 15 రూపాయలకే మూడు పూటల కడుపునిండా భోజనం పెట్టె అన్న క్యాంటీన్ ను కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి తెలియజేశారు. అలాగే కర్నూలు బి – క్యాంపులో హైకోర్టు బెంచ్ మరియు అదునాతనమైన కలెక్టర్ కార్యాలయాన్ని నిర్మించే చర్యలు కూడా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను తెలిపారు. ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ...మంత్రి టి.జి.భరత్ ఆధ్వర్యంలో కర్నూలు లో ప్రతి వారము ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతూ ఉందని అందులో భాగంగా ఈ రోజు 6 కోట్ల రూపాయలతో రైతు బజారు విస్తరణ కార్యక్రమం కొరకు భూమి పూజ నిర్వహించడం జరిగిందని తెలిపారు. బి – క్యాంప్ లో హైకోర్టు బెంచ్ మరియు నూతన కలెక్టరేట్ నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. కర్నూలుకు ఉన్న సమస్యలు కర్నూలు మెడికల్ కాలేజ్ రోడ్డు విస్తరణ , స్పోర్ట్స్ హాస్టల్ తిరుపతికి వెళ్లకుండా ఇక్కడే ఉంచటం మరియు రైతు బజార్ దగ్గర ట్రాఫిక్ సమస్య పరిష్కరించి



రైతు బజార్ విస్తరణ చేయటం మొదలగునవని చేశాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి టి. జి. భరత్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నవని పార్లమెంటు సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు , మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ మూర్తి , కర్నూలు మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి , మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ అజమత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, ఇంజనీర్ రఘురామ రెడ్డి, స్థానిక నాయకులు స్వామి రెడ్డి, గున్నా మార్క్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి.

## ..రీ-ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టండి.

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 11:** ప్రజా సమస్యలను నిర్దేశిత గడువు దాటకుండా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును పరిశీలించి పెండింగ్ లో లేకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా అర్జీదారులకు అందజేసే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. రీ–ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించాలన్నారు. ఎట్ టూ వ్యూ లో ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్ లో ఉండకూడదన్నారు. అధికారుల లాగిన్ లోకి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. సిఎంఓ కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత, రామసుబ్బయ్య జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

## బండి ఆత్మకూరు మండలంలోని వెంగళరెడ్డి పేట గ్రామంలో నిర్వహించే ప్రతిష్ఠ మహోత్సవానికి 10,000/-విరాళం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 10:**
నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల పరిధిలోని వెంగళరెడ్డి పేట గ్రామం నందు గణపతి, రాములమ్మ, పోతురాజు వారి ప్రతిష్ట మహోత్సవం ఈనెల 11వ తేదీన అనగా సోమవారం రోజున జరుగుతున్నది. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ టీడీపీ నాయకులు తోట శివయ్య గారు మరియు గ్రామస్తులు కలిసి నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జి, బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు గారిని సగౌరవంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు గారు మాట్లాడుతూ గణపతి, రాములమ్మ, పోతురాజు వారి ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానానికి తనను ఆహ్వానించిన గ్రామస్తులకు,కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మంత్రి ఎన్ ఎండి. ఫరూక్ ఆదేశాల మేరకు 12వ తేదీ అనగా మంగళవారం నాడు నిర్వహించే ఒంగోలు జాతి రాష్ట్ర స్థాయి వృషభరాజుల పోటీలకు రెండు పండ్ల విభాగం నాల్గవ బహుమతికి తన వంతుగా 10,000/-రూపాయలు నగదు ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ టీడీపీ నాయకులు తోట శివయ్య, తాటికొండ మహేష్ బాబు, ఆరవీటి బాబు, తెలుగు వెంకటేశ్వర్లు, యడవల్లి రాము తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 'పిడతల సుధాకర్ సమ్మర్ ప్రీమియర్ లీగ్' క్రికెట్ టోర్నమెంట్.

**యువతకు క్రీడలు ఎంతో అవసరం: ఎన్ఎండి ఫయాజ్.**
**..పాల్గొంటున్న 50కి పైగా జట్లు.**
**..మే 20 వరకు సాగనున్న క్రీడా సంబరం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 11:**
నంద్యాల జిల్లా యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన "పిడతల సుధాకర్ సమ్మర్ ప్రీమియర్ లీగ్" క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ సోమవారం ఘనంగా ఎస్.పి.జి గ్రౌండ్ నందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఇంతటి భారీ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసిన పిడతల సుధాకర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా నలుమూలల నుండి సుమారు 50 జట్లు పాల్గొంటున్నాయి. నేటి నుంచి ప్రారంభమైన ఈ పోటీలు మే 20వ తేదీ వరకు ఉత్సాహంగా సాగుతాయని తెలిపారు. విజేతలకు ప్రోత్సాహకంగా భారీ నగదు బహుమతులను ప్రకటించారు ప్రథమ బహుమతి: రూ. 50,000/- (దాత: పిడతల సుధాకర్), ద్వితీయ బహుమతి: రూ. 30,000/- (దాతలు: ఏరుకలా నాగేంద్ర, ఔక్ సంపత్, గుండి ప్రేమ్), తృతీయ బహుమతి: రూ. 20,000/- (దాతలు: సింహాసనం నాగేష్, స్మైనెట్ సాయి జయంత్) ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి రవి, మాజీ కౌన్సిలర్ కృపాకర్, శరత్, జార్జ్, నాగేష్, సాయి జయంత్, అరుణ్ బేగ్ నిర్వాహకులు, క్రీడాకారులు మరియు క్రీడా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు







# ఆటో నగర్ లో 100 కోట్ల భారీ కుంభకోణం.!

## ...భూ కుంభకోణం పై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీకి వినతి పత్రం.

**...4.50 ఎకరాల మున్సిపల్ గ్రీనరీ స్థలం...**
**పంట కాల్వలు ఆక్రమించి విక్రయించి సొమ్ముచేసుకున్నారు.**
**...తెలుగుదేశం పార్టీ గతంలో స్థలాలు ఇచ్చారు...వైసిపి హయాంలో అమ్ముకున్నారు.**
**...ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళతా.**
**...ఆటో నగర్ బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటా.**
**...ఆటో నగర్ కు చెందిన అన్ని శాఖలు విచారణ చేయాలి.**
**...తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 11:**
నంద్యాల పట్టణశివారులోని ఆటో నగర్ పారిశ్రామిక ప్లాట్లు కేటాయింపులో 100 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. భూ కుంభకోణంపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా,జిల్లా ఎస్పీ సునీల్ షెరా న్ కు వినతి పత్రం అందించారు. అనంతరం భూమా విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికులను దృష్టిలో పెట్టుకొని ఆటో నగర్ ప్రాంతానికి ప్రత్యేక జీవో ఇచ్చి అక్కడ సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఆటో నగర్లో అర్హులైన వారికి కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వారి అనుచరులకు,కుటుంబసభ్యులకు స్థలాలు కట్టబెట్టారని ఆరోపించారు. అధికారులపై వత్తిడి తెచ్చి అక్రమంగా రిజిస్టర్లు చేయించుకోవడం వెనుక పెద్ద కుట్ర జరిగిందన్నారు. ఆటోనగర్ లో అప్పట్లో 300 మందికి ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. 2019 లో వైసిపి అధికారంలో కి వచ్చిన తర్వాత వైసీపీ కి చెందిన కొందరు కౌన్సిలర్స్,కొందరు సభ్యులు ఆటో నగర్ అసోసియేషన్ లో చేరి స్థలాలు అన్యాయంగా సంబంధం లేని వారికి విక్రయించారన్నారు. ఆటో నగర్ భూములు అన్యాక్రాంతంగా ఇతరులకు విక్రయించిన వాటిని వెనక్కు తీసుకొచ్చి బాధితులకు న్యాయం చేయాలని వినతి పత్రాలు అందించామన్నారు. ఆటోనగర్ లో కార్మికుల జీవితాలను దృష్టిలో పెట్టుకొని 46 ఎకరాల స్థలం టీడీపీ హయాంలో ఇచ్చిన వాటిని ఆటో నగర్ వాసులకు ఒకొక్కరికి 5 నుంచి 10 సెంట్లు ఇవ్వాల్సింది. అక్కడ ఆటో నగర్ అసోసియేషన్ సభ్యులు ఇష్టారాజ్యంగా ప్రవేటు వ్యక్తులకు,కుటుంబ సభ్యులకు 20,30,40 సెంట్లు రిజిస్టర్ చేయించారన్నారు. నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే స్థలాలు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా వారికి నచ్చిన వారికి విక్రయించి 100 కోట్ల భారీ భూ కుంభకోణం చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. గతంలో ఆర్డీఓ విచారణ చేసి 100 కోట్ల కుంభకోణం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకొని పోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఆటో నగర్ లో ప్రభుత్వం కేటాయించిన 46 ఎకరాల్లో ఎకరాకు మున్సిపాలిటీ గ్రీనరీ కి 10 సెంట్లు చొప్పున ఇవ్వాల్సిన మున్సిపాలిటీ గ్రీనరీ స్థలం దాదాపు 4.50 ఎకరాలు ఎక్కడ ఉన్నాయి అని అడిగితే సమాధానాలు లేవన్నారు. ఆటో నగర్ కు సంబంధించి అన్ని శాఖలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆటో నగర్ భూ కుంభకోణం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటానన్నారు. ఆటో నగర్ లో పంటకాల్వలు సైతం కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారన్నారు. తప్పుచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు. ఆటో నగర్ లో భూ కుంభకోణాలు,నిధుల మళ్లింపు,డబ్బులు ఎవరెవరికి ఇచ్చారు,ఎవరికి ఖర్చులు పెట్టారు,జమా ఖర్చులు అన్ని బయటికి వస్తాయని అన్నారు. 2014 నుంచి ఆటో నగర్ కు సంబంధించిన లెక్కలు,అసోసియేషన్ కు వచ్చే బాడుగలు సొసైటీ కి జమచేయకుండా ఇష్టం వచ్చినట్టు ఖర్చులు పెట్టీ అడిగితే దాడులు,బెదిరింపులు జరిగాయని ఆటో






నగర్ అసోసియేషన్ లోని మరో వర్గం నాయకులు పేర్కొన్నారు. ఆటో నగర్ ఏర్పాటు సమయంలో 360 మంది సభ్యులు ఉండేవారని,ప్రస్తుతం 600 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఆటో నగర్లో పని చేస్తున్న వారికి స్థలాలు ఇస్తామని దాదాపు 50 నుంచి 60 మంది వద్ద లక్ష నుంచి 5 లక్షలు తీసుకొని నేటివరకు స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఆటో నగర్ వాసులకు స్థలాలు రావడానికి ఆ నాడు భూమా నాగిరెడ్డి పుణ్యం వల్ల స్థలాలు వచ్చాయని,నేడు అబ్బాయి భూమా బ్రహ్మానందరెడ్డి మా స్థలాలు కాపాడటానికి ముందుకు వచ్చారని పేదల సమస్య పరిష్కరించాలంటే భూమా కుటుంబమే ముందుంటుందని అన్నారు.

## హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రత.

**..ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 11:**నంద్యాల పట్టణ కేంద్రంలో రేపు జరగనున్న హనుమాన్ శోభాయాత్రను పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, యాత్ర ప్రశాంతంగా సాగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు జిల్లా ఎస్ప సునీల్ షోరాణ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

రూట్ మ్యాప్ పరిశీలన: శోభాయాత్ర ప్రారంభ ప్రదేశం నుండి చివరి వరకు గల ప్రధాన కూడళ్లు మరియు సున్నితమైన ప్రాంతాలను ఎస్పీ స్వయంగా సందర్శించారు. ఊరేగింపు సాగే మార్గాల్లో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**సీసీ కెమెరాల నిఘా :** యాత్ర సాగే పొడవునా సీసీటీవీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుండి నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. అంతేకాక ప్రతి అంశం డ్రోన్ కెమెరాలతో క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలియజేశారు.

అనంతరం కంట్రోల్ రూమ్ సందర్శించి సిబ్బందికి దిశానిర్దేశం చేయడం జరిగింది.

**సిబ్బందికి దిశానిర్దేశం :** విధుల్లో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజలకు విన్నపం: శోభాయాత్రను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, పట్టణ ప్రజలు మరియు భక్తులు పోలీసులకు సహకరించాలని జిల్లా ప్రజలను ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్, ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, అస్రార్ భాష, ఎస్ ఐ సురేష్ ,శోభాయాత్ర నిర్వాహకులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 103 ఫిర్యాదులు.

**..విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.: జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మే 11:**
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీసునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 103 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ గారు స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# కెమిస్టుల జీవనాధారం,ప్రజారోగ్య రక్షణ కోసం..!

**...మే 20 న దేశవ్యాప్త బంద్ కు పిలుపు.**
**...ఆన్లైన్ లో మందుల అమ్మకాలు నిలిపివేయాలి.**
**...కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ ను నిలిపివేయాలి.**
**...నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలి.**
**ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్స్, డ్రగిస్ట్ అసోసియేషన్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 11:**
కెమిస్టుల జీవనాధారం,ప్రజారోగ్య రక్షణ కోసం మే 20 న దేశ వ్యాప్త బంద్ కు పిలుపునిస్తున్నామని నంద్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్ బాబు,బి .దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు కరుణ కుమార్ గుప్తా,పి.వెంకటరత్నం ఆదేశాల మేరకు బంద్ పాటిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా కెమిస్టులు,ఆన్లైన్ ఫార్మసీల నియంత్రణలేని కార్యకలాపాలు,అన్యాయ డిస్కౌంట్ విధానాలకు వ్యతిరేకంగా విధుల్లోకి రానున్నారని అన్నారు. అక్రమ ఈ ఫార్మసీలు,భారీ డిస్కౌంట్ కారణంగా దాదాపు 5 కోట్ల మంది ఆధారపడిన కుటుంబాల జీవనాధారం ప్రమాదంలో పడిందన్నారు. దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా కెమిస్టులు,ఔషధ పంపిణీ దారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అఖిల భారత కెమిస్టులు, డ్రగ్గిస్ట్ ల సంఘం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా మే 20 బుధవారం ఒకరోజు దేశవ్యాప్తంగా బంద్ ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కి సమర్పించిన వినతి పత్రంలో ఫార్మాస్యూటికల్ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న కీలక సమస్యలపై పలు మార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా కెమిస్టుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది అన్నారు. ప్రధాన ఆందోళన అంశాలను వివరించారు. అక్రమ ఈ ఫార్మసీలు ,ప్రజారోగ్యానికి అన్నారు. ఈ ఫార్మసీ ఫ్లాట్ఫార్ములు నియంత్రణ సడలింపులు దుర్వినియోగం చేస్తున్నాయని సమస్త ఆరోపించిందన్నారు. భౌతిక ధృవీకరణ లేకుండా మందులు విక్రయించడం వల్లే ఒకే ప్రిస్క్రిప్షన్ పదే, పదే ఉపయోగించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఏ వన్ ఆధారిత నకిలీ ప్రిస్క్రిప్షన్ లు ,యాంటీబయాటిక్స్ ,అలవాటు కలిగించే మందుల నియంత్రణ లేని లభ్యత వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని ఏ, ఐ,ఓ,సి,డి పేర్కొంది అన్నారు. ఇది ప్రజారోగ్యంతో నేరుగా రాజి పడటమేనని సమస్త అభిప్రాయపడింది అన్నారు. అన్యాయ ధరల విధానం వల్ల పెద్ద కార్పొరేట్ సంస్థలు అధిక డిస్కౌంట్ల ద్వారా మార్కెట్ సమతుల్యాన్ని దెబ్బ తెస్తున్నాయని అన్నారు. అవసరమైన మందులపై లాభాల మార్జిన్లు ప్రభుత్వం ద్వారా నిర్ణయించబడినప్పటికీ కొన్ని సంస్థలు అన్యాయ పోటీనిసృస్తున్నాయని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో కెమిస్టుల జీవనాధారం ప్రమాదంలో పడుతుందని,చివరకు ప్రజలకు అందుబాటులో ఉన్న ఔషధ వ్యవస్త దెబ్బతింటుందని అన్నారు. అత్యవసర నోటిఫికేషన్ల ఉపసంహరణలో ఆలస్యం,కోవిడ్ - 19 సమయంలో 2020 మార్చి 26 న జారీ చేసిన అత్యవసర నోటిఫికేషన్ తాత్కాలిక చర్య మాత్రమేనని,దానిని ఇప్పటికీ కొనసాగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ నిబంధన డ్రగ్ రూల్ 65 లోని కఠిన నియమాలను,బలహీనపరుస్తుంది అని,డిజిటల్ ఫ్లాట్ఫార్ములు దీనిని ఉపయోగించి నియంత్రణ భద్రతా వ్యవస్థలను ఉల్లంఘిస్తున్నాయని అన్నారు. మా ప్రార్థన డిమాండ్ల కొవిడ్ కాలానికి సంబంధించిన తాత్కాలిక నోటిఫికేషన్ స్త్ర.ం.తీ.220 ( వ ) ను తక్షణమే ఉపహరించుకోవాలన్నారు. ఈ ఫార్మసీ సంబంధిత స్త్ర.ం.తీ.817 ( వ ) నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. పెద్ద కార్పొరేట్ సంస్థల అన్యాయ భారీ డిస్కౌంట్ లను అరికట్టేందుకు" లెవెల్ ప్లెయింగ్ ఫీల్డ్" విధానాన్ని అమలు చేయాలని విగ్నప్తి చేశారు. ప్రభుత్వం మే 20 లోపు మా డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే మేము నిరవదిక ఆందోళన ప్రారంభించాల్సివస్తుందని అన్నారు.

## నంద్యాల జిల్లాస్థాయి టీమ్ ఓపెన్ అండ్ ఉమెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం.

**..ప్రారంభించిన జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి.**
**..జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27వ తేదీన బాపట్లలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 10:** నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కె నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో మెన్ & ఉమెన్ పోటీలు వేరువేరుగా నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వాహనలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి బోర్డుపై పావులు కదిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ సాయి రోహిత్ మరియు నారాయణ రెడ్డి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ లు పాల్గొన్నారు. డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడ ఏకాగ్రతను ఇనుమడింపచేస్తుందని తద్వారా చదువు లో కూడా రానిచడానికి అవకాశలు అధికమవుతాయి అని అన్నారు. నంద్యాల పట్టణం నుండి ఇంటర్నేషనల్ రేటింగ్ తెచ్చుకున్న మొదటి బాలిక శాలిని ని మెమొంటోతో సత్కరించారు. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈరోజు జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు బాపట్లలో జరుగుతున్న రాష్ట్ర పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కర్రస్పాండెంట్ కృష్ణ సాయి రోహిత్ మరియు నారాయణ రెడ్డి బ్యాంక్ మేనేజర్ టోర్నమెంట్ ఆర్బిటర్ సుజాత, 100 మంది క్రీడాకారులు వారి తల్లిదండ్రులు చెస్ కోచ్ లు పాల్గొన్నారు.